నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

శుక్రవారం 8 డిసెంబర్ 2023
FRIDAY, DECEMBER 8, 2023

MANCHERIAL
KUMURAM BHEEM ASIFABAD

పేజీలు : 8
PAGES

## పూర్తిగా నష్టపోత..

నాకున్న పదెకరాల్లో పత్తి వేసిన. మొదట్లో మంచిగా వర్షాలు కురవడంతో పత్తి ఏపుగా పెరిగింది. ఆ తర్వాత రెండు నెలలు వర్షాలు పడకపోవడంతో పూత, ఖాత అనుకున్నంత రాలేదు. ఇందుకోసం చాలా ఖర్చు చేసి మందులు కొట్టిన. ఎకరానికి కనీసం పది క్వింటాళ్లు వస్తుందని ఆశపడ్డా. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి పూర్తిగా తడిసి నల్లబారుతోంది. భూమి మీద పడ్డ పత్తి పనికి రాదు. ఇప్పుడు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6,400 మాత్రమే ధర పెడుత అంటున్నరు. రంగు మారితే రూ.400 నుంచి రూ.500 వరకు తక్కువ వస్తాయి. ధర పడిపోవడంతోపాటు నేలరాలిన పత్తి అమ్మకానికి పనికిరాదు. ఎకరాకు ఏడెనిమిది క్వింటాళ్లు వచ్చినా రూ.4 వేల వరకు నష్టం వస్తది. నేలరాలిన పత్తి కనీసం రెండు క్వింటాళ్లు ఉంటది. ఇలా రైతుకు రూ.12 వేల నష్టం వస్తది. పదెకరాలకు కనీసం రూ.60 వేలు నష్ట పోతా. ఇలానే వానలు పడితే చెట్టు మీదనే మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. ఇలా అయితే ఇక దూది కొనక పూర్తిగా నష్టపోత.

- పుట్ట గంగయ్య, పత్తి రైతు,
(నెన్నెల మండలం)



# దూది రైతు దుఃఖం

మధ్య పేజీలో



నెన్నెల మండల కేంద్రంలో వర్షానికి తడిసి నేలరాలుతున్న పత్తి

## పత్తి రైతులను నిండా ముంచిన మిగ్‌జాం తుఫాన్

- వర్షపు నీళ్లతో నిండి నేలరాలుతున్న దూది
- నల్లబారితే తక్కువ ధర వస్తోందని ఆవేదన
- కల్లాలు, రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం వర్షార్పణం
- రైతులను ఆగమాగం చేస్తున్న అకాలవర్షం
- ఉమ్మడి జిల్లాలో ఏ కర్షకుడిని కదిలించినా కన్నీరే..

**మిగ్‌జాం తుఫాన్ దూది రైతులను** నట్టేట ముంచుతున్నది. బంగాళాఖాతంలో ఏర్పడిన సైక్లోన్ ప్రభావంతో పత్తి వర్షపునీటితో తడిసి నల్లబారుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానంగా ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పత్తి అధికంగా పండిస్తారు. పత్తి ఏరడానికి కూలీలు దొరక్కపోవడం, కండ్లముందే పత్తి వర్షానికి తడిసి పోతుండడంతో అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు. నష్టం ఏం లేదని వ్యవసాయాధికారులు అంటున్నా.. దిగుబడి తగ్గి, సగం ధర కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కొన్ని చోట్ల వరి కోతలు ప్రారంభం కాగా.. మరికొన్ని చోట్ల ధాన్యాన్ని కేంద్రాలు, కల్లాలు, రోడ్ల వెంట రాసులుగా పోయడంతో వర్షార్పణమైంది. కల్లాల దగ్గర రైతులు ఆరబోసి కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒకవేళ మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే చాలా నష్టం సంభవించే అవకాశం ఉంది. ధాన్యం రైతులు ఆగమవుతుండగా.. పత్తి కర్షకులకు కన్నీరే మిగిలే అవకాశం ఉంది. - మంచిర్యాల, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి)




## 'గ్యాస్' కేవైసీ కోసం..

ఆదిలాబాద్‌లో గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ఎదుట క్యూ కట్టిన జనం

**కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో** ఆరు గ్యారంటీలను ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.500 సిలిండర్ ఇస్తామని పేర్కొంది. పార్టీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం రూ.500 సిలిండర్ ఇస్తోందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. సిలిండర్ కోసం ఆధార్ కార్డు కేవైసీ ఇచ్చేందుకు జనం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల ఎదుట భారీ సంఖ్యలో బారులు దీరుతున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండేన్, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలకు చాలా మంది రావడంతో నిర్వాహకులు టోకెన్లు ఇచ్చి మరుసటి రోజు రమ్మంటున్నారు.

- ఆదిలాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ)

## యాసంగికి సన్నద్ధం



### ప్రణాళికలు తయారు చేసిన అధికార యంత్రాంగం

57,805 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా

**కుమ్రం భీం ఆసిఫాబాద్** జిల్లావ్యాప్తంగా యాసంగి సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కూడా సమకూర్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 57,805 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వరి 35 వేల ఎకరాలు, శనగ 4 వేలు, జొన్న 14,300, మక్క 2,120, పెసర 250, మినుములు 140, కందులు 1,750, గోధుమలు 245 ఎకరాల్లో సాగవుతాయని అధికారులు భావిస్తున్నారు. నాలుగు వేల క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాల కోసం అధికారులు నివేదికలు పంపించారు. వరి, జొన్న, మక్క, పెసర, మినుములు, కందులు, గోధుమల సాగుకు కావాల్సిన విత్తనాలను రైతులే సమకూర్చుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఎరువులను కూడా ఆన్‌లైన్ విధానంలో నేరుగా ఫర్టిలైజర్ దుకాణాల నుంచి సబ్సిడీపైనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. - కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ)